పాలిటెక్నిక్ విద్యార్థులకు శుభవార్త

- ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- రెండేళ్లపాటు భ్రమరాంబిక జూనియర్ కాలేజీలో కొనసాగింపు
- కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు షురూ

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గంలోని పాలిటెక్నిక్ విద్యార్థులకు శుభవార్త. ఇటీవల ప్రభుత్వం గుంతకల్లుకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేసిన విషయం విదితమే. ఈ కళాశాలను తాత్కాలికంగా మున్సిపాల్టీకి చెందిన ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత శ్రీశైల భ్రమరాంబిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులను కొనసాగించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ప్రస్తుతానికి కళాశాలలో ఏర్పాట్ల పర్యవేక్షణకై ఒక ఓఎస్డీ, ఇద్దరు అధ్యాపకులను నియమించింది. కళాశాల ప్రారంభమయ్యే నాటికి సబ్జెక్టుల వారీగా అవసరమైన లెక్చరర్లు, ఒక ఫిజికల్ డైరెక్టర్, ఒక లైబ్రేరియన్, ఆఫీస్ సూపరింటెండెంట్-1, సీనియర్ అసిస్టెంట్లు-3, జూనియర్ అసిస్టెంట్లు-3 చొప్పున నియామకానికి చర్యలు ప్రారంభమైనట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలిసింది.

కళాశాలకు నాలుగు కోర్సులు..240 సీట్లు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం కానున్న మున్సిపాల్టీ భవనాలు(ఇన్‌సెట్‌లో) కళాశాలలో కోర్సు, సీట్ల వివరాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు నాలుగు కోర్సులు మంజూరు చేస్తూ సాంకేతిక విద్యాశాఖ అనుమతినిచ్చింది. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్-60 సీట్లు, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్-60 సీట్లు, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్-60 సీట్లు, డిప్లొమా ఇన్ ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ 60 సీట్లు కేటాయించింది. కళాశాల కోడ్ కూడా జీటీకేఎల్‌గా నిర్ధారించింది.

సొంతభవనాలు నిర్మించే వరకు ఇక్కడే కొనసాగింపు..

గుంతకల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ పరిపాలనా అనుమతులిస్తూ ఈ ఏడాది మార్చి 20న రాజపత్రాన్ని (నెం.328)ను విడుదల చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. అంతేకాకుండా కళాశాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు రూ.34.74 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్న విషయం విదితమే. కళాశాలకు స్థలాన్ని సేకరించి సొంతభవనాలు నిర్మించేంత వరకు మున్సిపాల్టీకి చెందిన పాత భ్రమరాంభిక జూనియర్ కాలేజీలోనే పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించనున్నారు.

ఈ ఏడాదే తరగతులు ప్రారంభం

కళాశాల సొంతభవనాలు నిర్మించే వరకు మున్సిపాల్టీకి చెందిన భవనాల్లోనే గుంతకల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను కొనసాగించేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చొరవతో ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించనున్నాము. కళాశాలకు 4 కోర్సులు, 240 సీట్లు మంజూరయ్యాయి. పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. ఇక వెబ్ ఆప్షన్ ఎప్పటి నుంచి పెట్టుకోవాలో ప్రభుత్వం త్వరలోనే తేదీని ఖరారు చేయనుంది. వెబ్‌ఆప్షన్ పెట్టుకోవడానికి గుంతకల్లు కళాశాల కోడ్ 'జీటీకేఎల్'గా ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానున్న గుంతకల్లు, బేతంచెర్ల, మైదుకూరు పాలిటెక్నిక్ కళాశాలలకు అవసరమైన 128 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి కూడా ప్రభుత్వం ఆమోదించింది. త్వరలోనే గుంతకల్లుకు కూడా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించనుంది.

– ఎం.ధీరేంద్రబాబు, ఓఎస్డీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, గుంతకల్లు

క్లుప్తంగా

15 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

యాడికి: మండల కేంద్రంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన జాబ్‌మేళాలో 15 మందికి ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరినాథ రెడ్డి తెలిపారు. ఆల్ సెక్ టెక్నాలజీస్ కంపెనీ ఆధ్వర్యంలో (ఈ కామర్స్, బ్యాంకింగ్, టెక్నికల్ విభాగాలు) నిర్వహించిన మేళాలో 100 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. 5 మందికి చెన్నైలో, అదే సంస్థకు చెందిన బెంగుళూరులో 10 మంది ఎంపికయ్యారన్నారు. కంపెనీ ప్రతినిదులు బాబాఖాన్, ఏజీఎం అరుల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బసవరాజు, సుబ్బరాయుడు, జగ్గయ్య, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బళ్లారి రాఘవ అవార్డు గ్రహీత చిదంబర్‌రెడ్డికి సన్మానం


చిదంబరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రముఖ నాటక రంగ కళాకారుడైన చిదంబర్‌రెడ్డికి ఇటీవల బళ్లారి రాఘవ అవార్డు దక్కింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని శ్రీ సాయి జూనియర్ కాలేజీలో కరస్పాండెంట్ జయరంగారెడ్డి, ప్రిన్సిపాల్ కాంతారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పుర ప్రముఖులు చిదంబర రెడ్డిని శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు చిదంబర రెడ్డి నాటక రంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రంగన్న, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, జేవీవీ గౌరవాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, షిర్డీసాయి సేవా సమితి నాయకులు కందుల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విన్సెంట్ ఫెర్రర్ పాఠశాల స్థాయి క్రికెట్ టోర్నీ


కొనకొండ్ల జెడ్పీహైస్కూల్ జట్టుకు ట్రోఫీ అందజేసిన దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు వారాలుగా జరుగుతున్న విన్సెంట్ ఫెర్రర్ పాఠశాలస్థాయి క్రికెట్ టోర్నీ ముగిసింది. ఆదివారం గుంతకల్లు మాంటిస్సోరి స్కూల్- వజ్రకరూర్ మండలం కొనకొండ్ల జెడ్పీ హైస్కూల్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. కొనకొండ్ల జెడ్పీ హైస్కూల్ జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. కొనకొండ్ల జట్టులోని విద్యార్థులకు ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ ఏటీఎల్ వరకుమార్, కోచ్ ఇనాయతుల్లా, ఫిజికల్ డైరెక్టర్లు వేణుగోపాల్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు


గాయపడిన దస్తగిరి

పెద్దవడుగూరు: మండల పరిధిలోని మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని మిడుతూరు గ్రామానికి చెందిన దస్తగిరి అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. మిడుతూరు గ్రామానికి చెందిన దస్తగిరి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మొక్కలు నాటి సంరక్షించండి


మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుత్తి రూరల్: తొండపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వన మహోత్సవం నిర్వహించారు. గుత్తి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సౌజన్యంతో హెచ్ఎం శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పాఠశాల ఆవరణలో 200 మొక్కలను నాటించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ మొక్కలతో స్నేహం చేసి వాటిని సంరక్షించాలన్నారు. మానవాళి మనుగడకు మొక్కల పెంపకం చాలా అవసరమన్నారు. పర్యావరణ సమతుల్యానికి ప్రతి విద్యార్థి మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్లస్టర్ హెడ్ అరవిందకుమార్, ఆపరేటింగ్ మేనేజర్లు నాగేశ్వరరావు, గోపాల్, సూర్యనారాయణ, సుబ్బారెడ్డి, డిప్యూటీ మేనేజర్లు బాలకృష్ణ, సుధాకర్, కిరణ్‌కుమార్ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీఈటీ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


జగదీశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: ప్రమాదవశాత్తు కిందపడి కాలువిరగడంతో ఇంట్లో విశ్రాంతి పొందుతున్న రెడ్డి సంఘం కోశాధికారి జగదీశ్వర్‌రెడ్డిని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఆదివారం రెడ్డి సంఘం నాయకులతో కలిసి ఆయన నివాసానికి యోగక్షేమాల గురించి ఆరా తీశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముని నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి ఆయనను పరామర్శించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: మండలంలోని సోదనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త ఏకుల వెంకటన్న(80) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి , సర్పంచ్ గోపాలు రెడ్డి గ్రామానికి చేరుకుని వెంకటన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పామిడి: రామరాజుపల్లిలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరగనుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

అల్ అమీన్ జకాత్ సొసైటీ సేవలు ప్రశంసనీయం


విద్యార్థినికి స్కాలర్‌షిప్ అందిస్తున్న జకాత్ సొసైటీ సభ్యుడు

గుంతకల్లుటౌన్: నిరుపేద ముస్లిం విద్యార్థుల విద్యాభివృద్ధికి అల్ అమీన్ జకాత్ సొసైటీ ఏటా నిర్వహిస్తున్న సేవా, చేయూత కార్యక్రమాలు ప్రశంసనీయమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ అన్నారు. ఆదివారం స్థానిక ఈద్గా ఫంక్షన్‌హాల్‌లో సొసైటీ అధ్యక్షుడు హాజీ హమీద్‌సాబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంటర్ చదువుతున్న 35 మంది పేద ముస్లీం విద్యార్థులకు (ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున) రూ.87,500 స్కాలర్‌షిప్‌ల రూపంలో నగదు అందజేశారు. ఈసందర్భంగా మైమూన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో పదవీవిరమణ పొందిన ముస్లిం పెద్దలు జకాత్ సొసైటీని ఏర్పాటు చేసుకుని కొన్నేళ్లుగా ముస్లిం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తుండటం ఆదర్శనీయమన్నారు. జకాత్ సొసైటీ నిర్వహిస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు హమీద్ సాబ్, కార్యదర్శి దాదాఖాన్, ప్రభుత్వ అదనపు ఖాజీ సత్తార్‌సాబ్, కౌన్సిలర్ జేసీబీ.చాంద్‌బాషా, ఈద్గాఫంక్షన్ హాల్ చైర్మన్ ఎంబీ.మౌలా, మైనార్టీ నాయకులు మాలిక్‌సాబ్, మహబూబ్‌బాషా, నజీర్, వలి, అక్తర్, ఇంతియాజ్, సర్దార్‌బాషా, జైభీమ్‌పార్టీ నేత గౌసియాబేగం తదితరులు పాల్గొన్నారు.

డీజిల్‌షెడ్‌లో ఆకస్మిక తనిఖీలు


డీజిల్ లోకో మెయింటెనెన్స్‌పై ఆరా తీస్తున్న డీఆర్ఎం మనీషా అగర్వాల్

గుంతకల్లు: స్థానిక శాంతినగర్‌లోని డీజిల్ షెడ్‌లో డీఆర్ఎం మనీష్ అగర్వాల్ ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సందర్భంగా డీజిల్ షెడ్ సీనియర్ డీఎం ఈ మంగాచార్యులు, సీనియర్ డీఎఫ్ఎం అక్కిరెడ్డితో కలిసి డీజిల్ షెడ్‌ను పరిశీలించారు. డీజిల్ లోకో మరమ్మతు సమయంలో కార్మికులు భద్రత విషయమై ఆరా తీశారు. అదేవిధంగా లోకో మెయింటెనెన్స్‌పై కార్మికులతో అడిగి తెలుసుకున్నారు .అనంతరం షెడ్ బ్రాంచ్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. డీఆర్ఎం మాట్లాడుతూ షెడ్ అభివృద్ధికి ప్రతి కార్మికుడు కృషి చేయాలన్నారు. అందుకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీజిల్ షెడ్ డీఎంఎం వెంకటేశ్వర్లు, ఏఈఎన్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు

అమరవీరులకు నివాళి

గుంతకల్లుటౌన్: గుంటూరు జిల్లా చుండూరు అమరవీరులకు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) నాయకులు నివాళులర్పించారు. ఆదివారం స్థానిక న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్, పట్టణ అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు దేవేంద్ర, సత్తార్, గోపీ, బాషా తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు నిత్యావసరాల పంపిణీ

పామిడి: గుత్తి స్వీట్ సేవియర్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అనాథ బాలలకు ఆదివారం పామిడి లాల్‌భాగ్ చా రాజా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశ్రమంలోని 45 మంది అనాథ పిల్లలు, వృద్ధులకు రూ.15 వేలు విలువ చేసే నిత్యావసరాలు, వస్త్రాలు అందజేశారు.

దోభీ ఘాట్ ప్రారంభం


దోభీ ఘాట్‌ను ప్రారంభిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సహకారంతో రజకాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పెన్నా నదిలో నూతనంగా నిర్మించిన దోభీ ఘాట్‌ను ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా రజక సంఘం నాయకులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం దోభీ ఘాట్‌కు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రంగనాథ్‌రెడ్డి, నాయకులు పేరం ప్రతాప్‌రెడ్డి, డివికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత


టీచర్ అమరేంద్ర తల్లికి ఆర్థిక సాయం చేస్తున్న మిత్రబృందం

పామిడి: కన్న కుమారుడు మృతి చెందడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక చేయూతనందించారు. వివరాలు..స్థానిక ఉర్దూ స్కూల్‌లో పనిచేస్తున్న టీచర్ అమరేంద్ర(అవివాహితుడు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడిపై ఆధారడిపడిన తల్లి వెంకటలక్ష్మమ్మ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. విషయం తెలుసుకున్న అమరేంద్ర స్నేహితులు రైల్వే ఎం ఈశ్వరయ్య, వీఆర్వో ఎస్, దాదాఖలందర్ ఆధ్వర్యంలో 30 మంది రూ.67 వేలు పోగుచేశారు. ఆదివారం అమరేంద్ర ఇంటికి వెళ్లి వెంకటలక్ష్మమ్మ నగదు అందజేశారు.

'సీపీఆర్'పై అవగాహన అవసరం


శిక్షణలో పాల్గొన్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి అర్బన్: గుండె కొట్టుకోవడం ఆగినపుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకోలేని స్థిలో ఉన్నపుడు వెంటనే ప్రాణ రక్షణ ప్రక్రియలో భాగంగా చేపట్టాల్సిన 'సీపీఆర్'పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్ బాబు సూచించారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో అల్ట్రాటెక్ వికాస్ ట్రస్ట్ సౌజన్యంతో సీపీఆర్, ఏఈడీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఈఎంఆర్ఐకి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సతీష్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కార్డియాక్ అరెస్టు కారణంగా మరణాల సంఖ్య పెరిగిపోవడంతో సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ ఆసక్తి పెరిగిందన్నారు. కార్డియాక్ అరెస్టు కారణంగా పడిపోయిన వ్యక్తికి సీపీఆర్ ప్రక్రియ ద్వారా హృదయ శ్వాసకోవ పునరుజ్జీవనం కలిగించవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పీవీ సుబ్రమణ్యం, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, రోటరీ క్లబ్ సభ్యులు, అల్ట్రాటెక్ సంస్థ ప్రతినిధులు సూరపనాయుడు, డాక్టర్ రాజ్‌కమల్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర


అలంకరణలో ముత్యాలమ్మ

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రామాలయం వీధిలో వెలిసియున్న ముత్యాలమ్మ దేవాలయంలో ఆదివారం ముత్యాలమ్మ జాతర(96వ జాతర) వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గంగాధర్, సభ్యులు హేమావతి, ఉదయగిరి సుబ్బరాయుడు, బాల సుబ్రమణ్యం నాయుడు, ముత్యం కుమార్ ఆధ్వర్యంలో ఉదయం ఆరు గంటల నుంచి జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మ వారికి పంచామృతాభిషేకం, పూల అలంకరణ, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తెలంగాణ ఎస్ఐ పరీక్షల్లో కానిస్టేబుల్ ప్రతిభ


నరేష్‌యాదవ్ (ఫైల్)

తాడిపత్రి: పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే 2020 బ్యాచ్‌కు చెందిన నరేష్ యాదవ్ అనే కానిస్టేబుల్ తెలంగాణ రాష్ట్రంలో ఆదివారం ప్రకటించిన ఎస్ఐ పరీక్షా ఫలితాల్లో 5 వ ర్యాంకు సాధించాడు. నరేష్‌యాదవ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ పార్టీ పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతడు 7 నెలల క్రితం తెలంగాణ రాష్ట్ర ఎస్ఐ పోస్టులకు సంబంధించిన పరీక్షకు హాజరయ్యాడు. అందులో ప్రకటించిన ఫలితాల్లో నాన్ లోకల్ కోటాలో రాష్ట్ర 5వ ర్యాంకు సాధించి, జోన్ – 6 ఛార్మినార్ ఎస్ఐ పోస్టుకు ఎంపికయ్యాడు. వ్యవసాయం కుటుంబం నుంచి వచ్చిన నరేష్ యాదవ్ స్వగ్రామం తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి. అతడి తల్లిదండ్రులు లక్ష్మీనారాయణమ్మ, శ్రీరాములు. నరేష్‌యాదవ్ ఎస్ఐ పోస్టు సాధించడంపై యర్రగుంటపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

తాడిపత్రి అర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇస్రో ప్రాముఖ్యతపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజయనగర్ కాలనీలోని పద్మావాణి స్కూల్‌లో నిర్వహించిన పోటీలకు సుమారు 450 మంది విద్యార్థినులు హాజరయ్యారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ చింతా రమేష్‌నాథ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణ

తాడిపత్రి అర్బన్: రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఉర్దూ అకాడమీ ఇన్‌చార్జ్ పి.షంషాద్‌బీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక లలితా షోరూం పక్కనున్న ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ సెంటర్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 17వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 40 ఏళ్ల లోపున్న వారు అర్హులన్నారు. మైనార్టీలతో పాటు ఇతర కులాలకు చెందిన వారు కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. శిక్షణ కాల వ్యవధి 3 నెలలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490250133, 9440598443 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పశువులకు టీకా వేయించాలి

గార్లదిన్నె: పాడి పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకా ఉచితంగా వేస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ పశువులకు లంపీ స్కిన్ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా ప్రభుత్వం వ్యాక్సిన్ అందిస్తోందన్నారు. గాలి, ఈగల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. పశువుల చర్మంపై బుడిపెలు వచ్చి, తీవ్రమైన జ్వరం వస్తుందన్నారు. దీంతో పాల దిగుబడి తగ్గిపోయి, చనిపోయే ప్రమాదం ఉందన్నారు. పశువులు, దూడలకు రైతులు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఆర్టీసి కాంప్లెక్స్ పై భాగంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం ఆరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. నిందితుల నుంచి రూ.36,670 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం


మహమ్మద్ హుసేన్ (ఫైల్)

పెద్దవడుగూరు : విరుపాపురానికి ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు వివరాల మేరకు..పామిడిలో ఫొటో స్టూడియో పెట్టుకొని జీవనం సాగించే ముల్లా మహమ్మద్ హుసేన్ ఈనెల 2న పామిడికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. బాధతుడి తండ్రి ముల్లా హాజీవలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ఆచూకీ తెలిసిన వారు పెద్దవడుగూరు ఎస్ఐ : 9440796826, యాడికి సీఐ 9491308871 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు

పామిడి: పొశ్యంతండాలో ఆదివారం ఎద్దులబండి బోల్తా పడి ఇద్దరు కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. పొశ్యంతండాకు చెందిన కూలీలు ఆదివారం కూలీపనులకెళ్లారు. పనులు ముగించుకుని ఎద్దులబండిపై ఇంటికి బయలుదేరారు. దారిమధ్యలో ఎద్దుల బెదరడంతో బండి బోల్తాపడింది. ఈక్రమంలో కూలీ లక్ష్మక్కపై బండి వెళ్లడంతో నడుం విరిగింది. అలివేలమ్మ మెడ భాగానికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముగిసిన మొహర్రం వేడుకలు


పసలూరులో జలధికి వెళ్తున్న పీర్లస్వాములు

పెద్దపప్పూరు: మండల వ్యాప్తంగా ఆదివారం మొహర్రం వేడుకలు ముగిశాయి. పసలూరులో చివరిరోజు సాయంత్రం పీర్లస్వాముల ఘనంగా ఊరేగించారు. కోర్కెలు నెరవేరిన భక్తులు పీర్ల స్వాములకు చక్కెర, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వాములను జలధికి తీసుకెళ్లారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ తెలిపారు.

తాడిపత్రి: మొహర్రం వేడుకలు కనులపండువగా ముగిశాయి. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం అనంతరం పీర్లస్వాములు ఆయా గ్రామాల్లో పుర వీధుల గుండా ఊరేగాయి. భక్తులు పీర్ల స్వాములకు చక్కెర, కొబ్బెర, బెల్లం చదివింపులతో మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం పీర్ల స్వాములు జలధికి తరలివెళ్లాయి. మండలంలోని చుక్కలూరు, పిన్నేపల్లి గ్రామాల్లో జరిగిన మొహర్రం వేడుకలలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా రూరల్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలకు రిజిస్ట్రేషన్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఆర్బీకేల్లో మంగళవారం నుంచి ప్రత్యామ్నాయ విత్తనాలు కోసం రిజిస్ట్రేషన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. ఆదివారం ఏఓ మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు వర్షం రాకపోతే రైతులంతా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతుకు ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తుందన్నారు.

ముగిసిన విజ్ఞాన మేళా

పామిడి: స్థానిక సరస్వతీ విద్యామందిరంలో రెండు రోజులపాటు జరిగిన రాయలసీమ సరస్వతి విద్యామందిరాల విజ్ఞాన మేళా ఆదివారం ముగిసింది. సైన్స్, గణితం, క్విజ్, పేపర్ ప్రదర్శ పోటీ విజేతలకు స్థానిక స్టేట్‌బ్యాంకు మేనేజర్ విక్రమ్ సారనాథ్ బహుమతులు అందజేశారు. పాఠశాల కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, బీవీ రత్నమయ్య, జోజోడే కుమార్, చౌడయ్య పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 'సోమవారం' స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.